సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం । 5 । సెప్టెంబర్ । 2024



**పోషణ జీ.. పడాయి బీ**
జంగారెడ్డిగూడెం: స్థానిక హరిజనపేట అంగన్‌వాడీ కేంద్రంలో పోషన్ జీ పడాయి బీ నిర్వహించారు. ఆట పాటలతో విద్య, పోషణ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.



**హుండీ ఆదాయం రూ.6.92 లక్షలు**
ఏలూరు (ఆర్ఆర్‌పేట): రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో హుండీ లెక్కించారు. 68 రోజులకు **రూ.6,92,042 ఆదాయం సమకూరింది.**



**పశువులకు టీకాలు**
యలమంచిలి: పశువులకు వ్యాధులు సోకకుండా టీకాలు అందించాలని పశుసంవర్ధక అధికారి కె.మురళీకృష్ణ సూచించారు. కనకాయలంకలో ఆయన పర్యటించారు.

## న్యూస్‌రీల్

### పర్యావరణ పరిరక్షణకు కృషి



వినాయక మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న కలెక్టర్ నాగరాణి, ఎమ్మెల్యే అంజిబాబు

**భీమవరం:** పర్యావరణ పరిరక్షణకు సమిష్టిగా కృషి చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. జైత్ర బిజినెస్ సొల్యూషన్స్, వెస్ట్‌బెర్రీ స్కూల్, శ్రీభగవాన్ ట్రేడర్స్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత మట్టి వినాయక ప్రతిమల పంపిణీ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పర్యావరణాన్ని పరిరక్షించాలనే సంకల్పంతో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజిబాబు, జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి, సుబ్బరాజు, వెస్ట్‌బెర్రీ స్కూల్ డైరెక్టర్ నడింపల్లి మహేష్ కుమార్ వర్మ, శ్రీభగవాన్ ట్రేడర్స్ నడింపల్లి వెంకట రామరాజు, గాదిరాజు సుబ్బరాజు, చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, కలిదిండి బలరామరాజు, వేగేశ్న రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

### చెస్ టోర్నమెంట్ బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కేంద్ర సహాయ మంత్రి శ్రీనివాసవర్మ

**భీమవరం:** చెస్ క్రీడలో ప్రావీణ్యం ద్వారా ఉన్నత విద్యతో పాటు మేధా శక్తి పెంపొందించుకోవచ్చని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ అన్నారు. ఈ నెల 13 నుంచి మూడు రోజులపాటు అనసూయ చెస్ అకాడమీ, జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరం వన్‌టౌన్‌లోని శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపంలో నిర్వహించే ఇంటర్నేషనల్ బిలో 1600 రేటెడ్ చెస్ టోర్నమెంట్ బ్రోచర్‌ను బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించిన సందర్భంగా మాట్లాడారు. జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు మాదాసు కిషోర్ మాట్లాడుతూ మూడు రోజులపాటు జరిగే ఈ టోర్నమెంట్లో వివిధ దేశాలకు చెందిన 400 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని విజేతలకు రూ. 5 లక్షల నగదు బహుమతులు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు తోట హరిబాబు, పేరిచర్ల శ్రీనివాసరాజు(సుభాష్), చెస్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు అల్లూరి శివరామరాజు, జిల్లా సంయుక్త కార్యదర్శి మైలాపురి మురళి, అల్లు శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పోలీసు స్టేషన్లలో మోగిన ఫోన్లు

సాక్షి స్పందన

**భీమవరం:** జిల్లావ్యాప్తంగా పోలీసుస్టేషన్లలోని టెలిఫోన్లు ఎట్టకేలకు మౌనవ్రతం వీడాయి. ఈ నెల 2న 'సాక్షి'లో 'ఠాణాల్లో మూగబోయిన ఫోన్లు' శీర్షికన ప్రచురించిన కథనానికి పోలీసు శాఖ ఉన్నతాధికారులు స్పందించి టెలిఫోన్స్ బిల్లులు చెల్లించడంతో ఫోన్లు పనిచేయడం ప్రారంభించాయి. జిల్లా వ్యాప్తంగా 25 లా అండ్ ఆర్డర్ పోలీసుస్టేషన్స్, 4 ట్రాఫిక్ పోలీసు స్టేషన్స్ ఉండగా వీటికి గత కొంతకాలంగా బిల్లులు చెల్లించకపోవడంతో పనిచేయడం లేదు.

### రాజీమార్గమే.. రాజమార్గం

**తణుకు అర్బన్:** ఈనెల 14వ తేదీన నిర్వహించే జాతీయ లోక్‌అదాలత్‌లో కేసులు పరిష్కరించుకునేందుకు కక్షిదారులు ముందుకురావాలని మండల న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి విజ్ఞప్తి చేశారు. తణుకు కోర్టులో బుధవారం జాతీయ లోక్‌అదాలత్‌పై పలు వివరాలు వెల్లడించారు. రాజీకాదగ్గ క్రిమినల్ కేసులతోపాటు సివిల్, బ్యాంక్ బకాయి, వాహన ప్రమాదాలు వంటి కేసులను పరిష్కరించుకుని కక్షిదారులు తమ విలువైన సమయాన్ని, ధనాన్ని ఆదాచేసుకోవాలని సూచించారు. రాజీమార్గమే రాజమార్గమని.. రాజీచేసుకున్న కేసులకు సంబంధించి గతంలో కోర్టుకు కట్టిన ఫీజును తిరిగి తీసుకునే వెసులుబాటు కూడా ఉందని గుర్తుచేశారు.

### పారిశుద్ధ్య నిర్వహణలో ప్రథమ స్థానం

**ఏలూరు(మెట్రో):** గ్రామీణ ప్రాంతాలలో పారిశుద్ధ్య నిర్వహణపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్షించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఏలూరు జిల్లా ప్రథమ స్థానంలో నిలవగా.. ఈ సందర్భంగా జిల్లా అధికారులను డిప్యూటీ సీఎం అభినందించారు.

# అటు కొల్లేరు.. ఇటు గోదావరి

- ఉమ్మడి జిల్లాలో భయం.. భయం
- ఏజెన్సీలో గోదావరి వరద ఉధృతి
- కొల్లేరుకు కృష్ణా వరద తీవ్రత
- వేలేరుపాడులో 29 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- పోలవరం నుంచి 8.22 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల



కొయ్యలగూడెం: కన్నాపురం సమీపంలో కల్వర్టుపై నుంచి వరద



కైకలూరు: ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న కొల్లేరు కోమటిలంక గ్రామాల ప్రజలు



వేలేరుపాడు: పెద్దవాగు వంతెన ప్రాంతంలో పొంగిప్రవహిస్తున్న గోదావరి



పోలవరం: రేపల్లెవాడ, గుంజవరం మధ్య ప్రవహిస్తున్న కొండవాగుల నీరు



వేలేరుపాడు: ఎద్దెలవాగు వంతెన వద్ద పడవ దాటుతున్న గిరిజనులు

**సాక్షి ప్రతినిధి, ఏలూరు:** గోదావరి వరదతో ఏజెన్సీ ప్రాంతం.. కొల్లేరు వరదతో కైకలూరు, ఏలూరు రూరల్ మండలాలు విలవిల్లాడుతున్నాయి. పోలవరం ముంపు మండలాల్లోని గ్రామాల్లోకి గోదావరి నీరు చేరి రాకపోకలు నిలిచిపోగా, బుడమేరు వరద ప్రవాహంతో కొల్లేరు పొంగిపొర్లుతుంది. కృష్ణా, గోదావరి నదులకు అనుసంధానంగా ఉండే ప్రధాన కాల్వలు ఉప్పొంగి ప్రవహించడం.. మరో వైపు భారీ వర్షాలతో ఏలూరు జిల్లాలో వరద ఉగ్రరూపం దాల్చింది. గోదావరితో పాటు శబరి నదికి భారీగా వరద నీరు చేరడంతో నీటి ప్రవాహం పెరిగింది. బుధవారం సాయంత్రం 6 గంటల సమయంలో భద్రాచలం వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక స్థాయి దాటి 44.3 అడుగుల మేర నీటిప్రవాహం చేరింది. దీంతో వేలేరుపాడు మండలంలోని 29 గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వేలేరుపాడు మండలంలోని మేళ్ల వాగు, ఎద్దుల వాగు, టేకూరు వాగు, బుట్టాయగూడెం మండలంలోని కన్నాపురంలోని తూర్పు, పడమర కాల్వలు, రెడ్డిగణపవరంలోని జల్లేరు వాగు, కొల్లిరాముడిగూడెం సమీపంలోని కొండ వాగు, కన్నాపురం మార్గమధ్యంలోని వాగులు పొంగి పొర్లి రహదారులు జలమయమయ్యాయి. వేలేరుపాడు- కోయిదా, వేలేరుపాడు- రుద్రమకోట ప్రధాన రహదారులకు అనుసంధానంగా ఉండే 29 గ్రామాల మధ్య వాగులు గోదావరిలో కలవడంతో రహదారులు మునిగి రాకపోకలు నిలిచిపోయాయి. పోలవరం మండలంలోని మూడు కాల్వలు పొంగి పొర్లుతున్నాయి.

**పోలవరం నుంచి 8.22 లక్షల క్యూసెక్కుల నీరు**

గోదావరి వరద ఉధృతి బుధవారం ఉదయం నుంచి తీవ్రమైంది. మరో రెండు రోజులు పాటు వరద తీవ్రత కొనసాగుతుందని.. గరిష్ఠంగా 10 లక్షల క్యూసెక్కుల మేర ప్రవాహం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు 31.830 మీటర్ల ఎత్తు నుంచయి దిగువకు 8,22,922 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భద్రాచలంలో ఇప్పటికే మొదటి ప్రమాద హెచ్చరిక దాటింది. రెండవ ప్రమాద హెచ్చరిక జారీ అయితే వేలేరుపాడు, కుక్కునూరులో ఎక్కువ గ్రామాలు వరద ముంపులో చిక్కుకుంటాయి.

**రోడ్డెక్కిన కొల్లేరు**

కొల్లేరు ఉధృతంగా మారింది. కృష్ణా వరదల నేపథ్యంలో బుడమేరు నుంచి భారీగా వరదనీరు, ఖమ్మం జిల్లాలోని తమ్మిలేరు నుంచి ఏలూరు మీదుగా భారీగా వరద నీరు కొల్లేరుకు చేరింది. చాలా ఏళ్ల తరువాత కొల్లేరు పొంగిపొర్లుతుంది. ఏలూరు, కైకలూరు మధ్యలో మూడు ప్రాంతాల్లో కొల్లేరు పొంగి రోడ్డుపైకి రావడంతో రాకపోకలు కొన్ని గంటలు పాటు నిలిచిపోయాయి. మండవల్లి మండలంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, శ్రీరామనగర్, కులపర్రు, కొవ్వాడలంక, మచ్చుమిల్లి గ్రామాల్లోకి కొల్లేరు నీరు చేరింది. దీంతో ఆయా గ్రామాల్లోని ప్రధాన రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఏలూరు రూరల్ మండలంలోని కోమటిలంక రహదారి గట్టు తెగిపోవడంతో లంక గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. కోమటిలంక- ఆటపాక మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఏలూరు రూరల్ మండలంలోని గుడివాకలంక, ప్రత్తికోళ్ళలంక, పైడిచింతపాడు, పెదయాగనమిల్లి గ్రామాల్లో రహదారులు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. అన్ని గ్రామాల్లోని శ్మశానవాటికలు నీటమునిగాయి.

## ముంపు గ్రామాల ప్రజలు బయటకు రావద్దు



మండవల్లి మండలం పెదఎడ్లగాడి వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్, ఎస్పీ

**కైకలూరు/మండవల్లి:** కొల్లేరు పరీవాహక ముంపు ప్రాంతాల ప్రజలు ఇళ్లను వదలి బయటకు రావద్దని, ప్రభుత్వమే నిత్యావసరాలు, మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తుందని కలెక్టర్ కె.వెట్రిసెల్వి చెప్పారు. ఎస్పీ కె.ప్రతాప్ శివకిషోర్‌తో కలసి కైకలూరు మండలం ఆటపాక పక్షుల కేంద్రం సమీప కోమటిలంక గట్టు, మండవల్లి మండలం పెదఎడ్లగాడి వద్ద నీటి ప్రవాహాన్ని బుధవారం పరిశీలించారు. కోమటిలంక సర్పంచ్ యోహాను, పెద్దలు కోమటిలంక నుంచి పడవపై పక్షుల కేంద్రం గట్టుకు వచ్చి కలెక్టర్‌కు సమస్యలు వివరించారు. ఏటా వరదలకు తాత్కాలికంగా నిర్మిస్తున్న రహదారి కొట్టుకుపోతోందన్నారు. నిత్యావసరాలు అందించాలని కోరారు. కలెక్టర్ మాట్లాడుతూ పోల్‌రాజ్ డ్రెయిన్ ప్రవాహం దృష్ట్యా కోమటిలంకకు బోట్ల ద్వారా ప్రయాణం నిషేధించామన్నారు. గర్భిణులను ముందుగానే పీహెచ్‌సీలకు తరలించాలని వైద్యాధికారులకు ఆదేశించారు. ఎస్పీ మాట్లాడుతూ బోట్ల మీద ప్రయాణించకుండా రెవెన్యూ, పోలీసు సిబ్బంది పర్యవేక్షణ చేస్తారని తెలిపారు. మండవల్లి మండలం పెదఎడ్లగాని వంతెన వద్ద నీటి ప్రవాహాన్ని పరిశీలించారు. బుడమేరు నుంచి వచ్చే వరదనీరు పెనుమాకలంక నందిగామలంక, శ్రీరామ్ నగర్, ఇంగిలిపాకలంక, గ్రామాలకు వెళ్లే రహదారులు జలదిగ్బంధంలో ఉండటం వల్ల రాకపోకలు నిలిచిపోయాయని గ్రామ ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. పడవల ద్వారా నిత్యావసరాలు అందిస్తామని చెప్పారు.

## ప్రభుత్వ ఉద్యోగుల ఔదార్యం



కలెక్టర్ నాగరాణికి చెక్కు అందిస్తున్న ముఖ్య ప్రణాళిక కార్యాలయం అధికారులు, సిబ్బంది

**భీమవరం (ప్రకాశంచౌక్):** వరద బాధితుల సహాయార్థం జిల్లా ముఖ్య ప్రణాళిక కార్యాలయం అధికారులు, సిబ్బంది రూ.1.21 లక్షల చెక్కును సీపీఓ ఎం.మోహన్‌రావు చేతుల మీదుగా బుధవారం కలెక్టర్ చదలవాడ నాగరాణికి అందజేశారు. అలాగే ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి సాగిరాజు వెంకట సత్యనారాయణరాజు రూ.50 వేల చెక్కును జిల్లా కలెక్టర్ చాంబర్ నందు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విపత్కర పరిస్థితుల్లో పెద్ద మనసు చాటుకుంటూ ఆపన్న హస్తం అందిస్తున్న వారు ధన్యులని పేర్కొన్నారు. ఉద్యోగుల దాతృత్వాన్ని ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## వరద బాధితులకు ఆపన్నహస్తం

**జిల్లా నుంచి 2,81,900 ఆహార పొట్లాల పంపిణీ**

**భీమవరం (ప్రకాశంచౌక్):** విజయవాడ వరద బాధితులకు పశ్చిమగోదావరి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఆపన్న హస్తం అందింది. జిల్లా నుంచి మూడు రోజుల్లో 2,81,900 ఆహార పొట్లాలు, 95,640 వాటర్ ప్యాకెట్లు, 1.25 లక్షల బిస్కెట్ ప్యాకెట్లు, అర లీటర్ వాటర్ బాటిల్స్ 28,100, 30 వేల రొట్టెలు, 22 వేల రస్కుల ప్యాకెట్లు, 9 వేల జామకాయలు విజయవాడ చేరాయి. వివిధ స్వచ్ఛంద సంస్థలు, వ్యాపార వేత్తలు, విద్యాసంస్థలు, పారిశ్రామిక సంస్థల సహకారంతో వీటిని విజయవాడకు ప్రత్యేక వాహనాల ద్వారా పంపామని కలెక్టర్ నాగరాణి తెలిపారు. బుధవారం 82, 940 ఆహార పొట్లాలు, 25,640 వాటర్ ప్యాకెట్లు, 29,100 వాటర్ బాటిల్స్, 16 వేల రొట్టెలు, పదివేల బిస్కెట్ ప్యాకెట్లు, జామకాయలు, అరటిపళ్ళు విజయవాడకు పంపినట్లు తెలిపారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

**భీమవరం (ప్రకాశంచౌక్):** వర్షాలు, వరదలను సమర్థంగా ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని అధికారులను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వశిష్ఠ సమావేశ మందిరంలో అధికారులతో సమావేశమై రానున్న రెండు రోజుల్లో అల్పపీడనం నేపథ్యంలో ముందస్తు చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. గట్లు బలహీనంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి పటిష్ట పరచడానికి చర్యలు తీసుకోవాలన్నారు. తూడు, కిక్కిస తొలగింపు పనులు వేగవంతం చేయాలన్నారు. అవసరమైన మెటీరియల్ సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. కొవ్వొత్తులు, అగ్గి పెట్టెలు పెద్ద ఎత్తున సరఫరా చేసే వెండర్స్‌ను గుర్తించి సిద్ధంగా ఉంచాలన్నారు. పాలు, నిత్యావసరాలను యుద్ధ ప్రాతిపదికన సిద్ధం చేసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేయకుండా తాగునీటిని సరఫరా చేయకూడదని ఆదేశించారు. ప్రతి అధికారి, సచివాలయ సిబ్బంది క్షేత్రస్థాయిలో ఉండాలని ఆదేశించారు. కాళ్ల మండలంలో, నరసాపురం మండలంలోని మల్లవరం, కొప్పర్రు వద్ద డ్రెయిన్లు ఆక్రమణలకు గురై నిడివి తగ్గడంతో నీటి ప్రవాహం సాఫీగా జరగడంలేదని, దీని కారణంగా పంట పొలాలకు ఇబ్బంది ఎదురవుతుందని జిల్లా వ్యవసాయ అధికారి తెలిపారు. కలెక్టర్ స్పందిస్తూ ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## ఎన్‌ఎంఎంఎస్ పరీక్షకు 17 వరకూ గడువు

**ఏలూరు (ఆర్ఆర్‌పేట):** ఈ విద్యా సంవత్సరం జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 17తో గడువు ముగుస్తుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ, జిల్లా పరిషత్, మున్సిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని ఆంధ్రప్రదేశ్ ఆదర్శ పాఠశాలల్లో 8వ తరగతి చదువుతూ కుటుంబ సంవత్సర ఆదాయం రూ.3.50 లక్షల లోపు ఉన్న విద్యార్థులు మాత్రమే అర్హులన్నారు. ఈ పరీక్ష వచ్చే డిసెంబర్ 8న జరుగుతుందని, పరీక్ష రుసుం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించాలని, దరఖాస్తు చేసుకోవడానికి ఎలాంటి ధ్రువీకరణ పత్రాలు అవసరం లేదన్నారు.

## 59 మంది ఉపాధ్యాయులు అవార్డులకు ఎంపిక

**భీమవరం:** గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన వారి వివరాలను డీఈవో జి.నాగమణి బుధవారం తెలిపారు. 59 మంది అవార్డులకు ఎంపిక కాగా వారిలో ప్రధానోపాధ్యాయులు ముగ్గురు, స్కూల్ అసిస్టెంట్లు 26 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్స్ 24 మంది, సీఆర్ఎంటీలు ఇద్దరు, పీటీఐలు ముగ్గురు, ఐఈఆర్‌పీ ఒకరు ఎంపికైనట్లు తెలిపారు. వారికి ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో గురుపూజోత్సవంలో సన్మానం జరుగుతుందన్నారు.

## విధుల్లోకి తణుకు మున్సిపల్ కమిషనర్



మున్సిపల్ కమిషనర్ రామ్‌కుమార్

**తణుకు:** తణుకు మున్సిపల్ కమిషనర్ టి.రామ్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ధర్మవరం నుంచి బదిలీపై వచ్చిన ఆయన విధుల్లో చేరారు. ఇప్పటి వరకు డిప్యూటీ కలెక్టర్ హోదాలో పని చేసిన మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ రెవెన్యూశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి రిపోర్టు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ రామ్‌కుమార్‌కు మున్సిపల్ కార్యాలయం అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు. తణుకు మున్సిపల్ పరిధిలోని పారిశుద్ధ్య నిర్వహణతోపాటు పన్నుల వసూళ్లపై ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు.

## పోక్సో కేసులో వ్యక్తి అరెస్టు

**నరసాపురం:** పోక్సో కేసులో పట్టణంలోని 24వ వార్డుకు చెందిన నల్లి శ్రీనివాస్ అనే వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు టౌన్ సీఐ బి.యాదగిరి చెప్పారు. శ్రీనివాస్ తన ఇంటి ఎదురుగా రోడ్డుపై ఆడుకుంటున్న ఓ బాలిక(9)ను ఇంట్లోకి తీసుకెళ్లి అత్యాచార యత్నం చేశాడన్న ఫిర్యాదుపై మంగళవారం కేసు నమోదు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు సీఐ చెప్పారు.

# కొల్లేరుకు బుడమేరు గండం

**పెదఎడ్లగాడి వంతెన వద్ద పెరుగుతున్న నీటిమట్టం**



పోల్‌రాజ్ కాల్వలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్న దృశ్యం

**కైకలూరు:** బుడమేరు గండం.. కొల్లేరు ప్రజలను వణికిస్తోంది. ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని బిక్కుబిక్కుమంటూ కాలం గడుపుతున్నారు. విజయవాడ వద్ద బుడమేరు నీటిమట్టం తగ్గితే ఆ నీరంతా కొల్లేరుకు చేరాలి. మరో మార్గం లేదు. ఇప్పటికే కొల్లేరు నీటిని సముద్రానికి పంపించే క్రమంలో ప్రధాన భూమిక పోషించే మండవల్లి మండలం పెదఎడ్లగాడి వంతెన వద్ద 3.00 మీటర్లకు నీటమట్టం బుధవారం నమోదయ్యింది. ఇది మరింతగా పెరిగే అవకాశం ఉంది. పెదఎడ్లగాడి వద్ద డిశ్చార్జ్ కెపాసిటీ తగ్గడంతో ఎగువ నుంచి వస్తున్న వరద నీరు వెనక్కి మళ్లీ సమీపంలోని పెనుమాకలంక, ఇంగిలిపాకలంక, శ్రీరామ్‌నగర్, నుచ్చిమిల్లి, కొవ్వాలలంక, పులపర్రు గ్రామాల రోడ్లుకు వరదనీరు తాకుతోంది.

**67 డ్రెయిన్లు, వాగుల ద్వారా నీరు**

ఉమ్మడి పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి 67 డ్రెయిన్లు, వాగుల ద్వారా లక్షా 10 వేల క్యూసెక్కుల నీరు వరదల సమయంలో కొల్లేరుకు చేరుతోంది. వీటిలో కృష్ణా జిల్లా నుంచి బుడమేరు 27,687, పోల్‌రాజ్ మేజర్ డ్రెయిన్ 2,4,99 చంద్రయ్య డ్రెయిన్ 3,893, మోటూరు ఛానల్ 1,035, పశ్చిమగోదావరి నుంచి రామిలేరు 10,702, పెదపాడు డ్రెయిన్ 3,385, వట్లూరు డ్రెయిన్ 1,839, జాలిపూడి డ్రెయిన్ 7,260, కొవ్వలి డ్రెయిన్ 2,846, తోకలపల్లి డ్రెయిన్ 4,000, పందికోడు డ్రెయిన్ 2,352, పోతుమర్రు ప్రాజెక్టు నుంచి 4,250 క్యూసెక్కుల నీరు కొల్లేరుకు చేరుతోందని అంచనా. ముఖ్యంగా బుడమేరు గరిష్ఠ నీటి ప్రవాహ సామర్థ్యం 11 వేల క్యూసెక్కులుగా ఉంది. బుడమేరుతో పాటు ఇతర డ్రెయిన్లు, తమ్మిలేరు నీరు రావడంతో రానున్న రోజుల్లో కొల్లేరు గ్రామాలు పూర్తిగా నీట మునుగుతాయని భావిస్తున్నారు.

**గొల్లుమంటున్న కోమటిలంక :** ఏలూరు రూరల్ మండలానికి చెందిన కోమటిలంక గ్రామంలో దాదాపు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఈ గ్రామం కొల్లేరు మధ్యలో ఉండడంతో నిత్యావసరాల కోసం ప్రతి రోజు పడవలపై పోల్‌రాజ్ డ్రెయిన్ దాటి ఆటపాక పక్షుల కేంద్రం ద్వారా కైకలూరు రావాలి. అయితే ప్రస్తుతం పోల్‌రాజ్ డ్రెయిన్ ఉధృతంగా ప్రవహిస్తుండడం, ఆటపాక పక్షుల విహార కేంద్రం చెరువుకు గండిపడి నీరు ప్రవహిస్తుండడంతో మూడు రోజులుగా కోమటిలంక ప్రజలు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. కలెక్టర్ వెట్రిసెల్వి నిత్యావసరాలు పంపిస్తామని బుధవారం హామీ ఇచ్చారు.

## క్లుప్తంగా

### అతిథి అధ్యాపక పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

**తణుకు:** తణుకు ఎస్ఎన్‌వీటీ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంగ్లీషు సబ్జెక్టు బోధించేందుకు అతిథి అధ్యాపక పోస్టుకు తగిన అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్ కోరారు. ఎంఏ ఇంగ్లీషులో యాభై శాతం కంటే ఎక్కువ మార్కులు సాధించి ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 6లోపు కాలేజీలో దరఖాస్తులు అందజేయాలన్నారు. 9 ఉదయం 11 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూకు హాజరు కావాలని తెలిపారు.

### జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక


సాంగా డెస్ని

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** జాతీయస్థాయిలో నిర్వహించనున్న ఫుట్‌బాల్ పోటీలకు తాడేపల్లిగూడెంనకు చెందిన విద్యార్థిని సాంగా డెస్ని ఎంపికైంది. అనంతపురంలో గత నెలలో జరిగిన అండర్-13 సబ్ జూనియర్ బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో డెస్ని ప్రతిభ చూపింది. ఆమె రాష్ట్ర జట్టుకు ఎంపిక కాగా ప్రస్తుతం అనంతపూర్ స్టేడియంలో శిక్షణ పొందుతున్నారు. ఈ నెల 6న మధ్యప్రదేశ్‌లో నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ పోటీల్లో డెస్ని ఆడనుంది. డెస్నిని జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు తెన్నేటి జగ్జీవన్, కోచ్ నాని కమలాకర్ తదితరులు అభినందించారు.

### ఉత్సవ పందిళ్లకు గణనాథులు


ఊరేగింపుగా గణనాథుని విగ్రహాన్ని తాడేపల్లిగూడెం తీసుకొస్తున్న భక్తులు

**తాడేపల్లిగూడెం రూరల్:** వినాయక చవితిని పర్వదినాన్ని పురస్కరించుకొని గణనాథుల విగ్రహాలు ఉత్సవ పందిళ్లకు చేరుతున్నాయి. తాడేపల్లిగూడెం పట్టణానికి చెందిన ఉత్సవ నిర్వాహకులు హైదరాబాద్, విజయవాడ ప్రాంతాల నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన విగ్రహాలను బుధవారం నుంచి తమ ఉత్సవ పందిళ్లకు చేరుస్తున్నారు. ఈ క్రమంలో బాణసంచా కాల్పుల మధ్య భారీ కార్లు, మోటారు సైకిళ్లతో ర్యాలీ నిర్వహించారు.

# భయపెడుతున్న వైరల్ జ్వరాలు

- వ్యర్థాలతో నిండిన డ్రెయినేజీలు
- వీధుల్లో పేరుకుపోయిన చెత్తకుప్పలు
- విజృంభిస్తున్న దోమలు, ఈగలు


వల్లూరుపల్లి మంచినీటి చెరువులో పేరుకుపోయిన నాచు


కొండేపాడులో ఒక వీధిలో నిల్వ ఉన్న మురుగునీరు

**పెంటపాడు:** మండలంలో పారిశుద్ధ్యం క్షీణించింది. ఎక్కడ చూసినా చెత్తకుప్పలు, దుర్వాసన, డ్రైనేజీల్లో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలు, పూడుకుపోయిన కచ్చా డ్రెయిన్లు వ్యాధుల వ్యాప్తికి కారకాలుగా తయారయ్యాయి. భారీ వర్షాల కారణంగా ప్రతి ప్రదేశంలోనూ ఎక్కడ చూసినా వీధులు చిత్తడిగా దర్శనమిస్తున్నాయి. ఇటీవల కురిసిన వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాలు బురదమయంగా మారాయి. దీంతో దోమలు, ఈగలు విజృంభించడంతో జ్వరాలు ప్రబలుతున్నాయి. పీహెచ్‌సీల్లో ఓపీ కేసులు భారీగా పెరుగుతున్నాయి. ప్రతి ప్రాంతంలోనూ వైరల్ జ్వరాలు, టైఫాయిడ్ కేసులు నమోదవుతున్నాయి. ఖాళీ స్థలాల్లో మురుగునీరు చేరి అపరిశుభ్రత చోటు చేసుకుంటోంది. దీంతో దోమలు వృద్ధి చెంది వ్యాధులు ప్రబలుతున్నాయి.

**తాగునీరు కలుషితం**

పలు గ్రామాల తాగునీటి చెరువుల పర్యవేక్షణ లోపం వల్ల తాగునీరు కలుషితమవుతోంది. కురిసిన వర్షం నీరు డ్రెయినేజీల ద్వారా తాగునీటియ చెరువులోకి యథేచ్ఛగా కలుస్తోంది.దీనిపై పంచాయతీ అధికారులు దృష్టి సారించడం లేదు. ప్రధానంగా చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు వ్యాధుల బారిన పడుతున్నారు. పారిశుధ్యాన్ని పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. గతంలో ఈ వర్షాకాల సమయంలో దోమలు పెరగకుండా ఫాగింగ్, స్ప్రేలు చేసేవారు. కానీ ఆ చర్యలు ప్రస్తుతం కానరావడం లేదని ప్రజలు చెబుతున్నారు. పారిశుద్ధ్యంపై తక్షణం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ప్రధానంగా విప్పర్రులో డ్రెయినేజీల నీరు తాగునీటి చెరువులో కలుస్తోంది. పెంటపాడు పీహెచ్‌సీ వెనుక వీధి, కునాకరపేట జగ్జీవన్ విగ్రహం వద్ద, వెలమపేటలో, కొబ్బరితోట ప్రాంతంలో డ్రెయినేజీ సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. అక్కడ మురుగునీరు పేరుకుపోయింది. యానాలపల్లిలో తాగునీటి చెరువు కలుషితమైంది. చెరువు నీరు పసర్లుపట్టి అపరిశుభ్రంగా తేలియాడుతోంది. యానాలపల్లి ఎస్సీపేట, లూథరన్ చర్చి ప్రాంతాల్లో మురుగు నీరు నిల్వ ఉంది. అధికారులు స్పందించి తక్షణం పారిశుద్ధ్య చర్యలు తీసుకోవాలని యానాలపల్లి గ్రామ ప్రజలు కోరుతున్నారు.

### మొక్కల పంపిణీ


అత్తిలిలో మొక్కలు నాటుతున్న దృశ్యం

**అత్తిలి:** శ్రీవిశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు అత్తిలి శాఖ ఆధ్వర్యంలో 2 వేల మొక్కలను బుధవారం అత్తిలిలో నాటారు. ఈ సందర్భంగా పీఠం సభ్యులు మాట్లాడుతూ పీఠాధిపతి ఉమర్ ఆలీషా ఆదేశాల మేరకు నా మొక్క – నా శ్వాస కార్యక్రమం ద్వారా ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టినట్టు తెలిపారు.

### సీఎం రిలీఫ్ ఫండ్‌కు రూ. లక్ష సాయం

**తణుకు:** రాష్ట్రంలో వరద బాధితుల సహాయార్థం తణుకు వైనాట్ ఎలక్ట్రానిక్స్ అండ్ హోం అప్లయన్సెస్ ఆధ్వర్యంలో రూ. లక్ష ఆర్థిక సాయం అందజేసినట్లు సంస్థ అధినేత జుజ్జవరపు వెంకటరాయుడు బుధవారం తెలిపారు. ఈ మేరకు ముఖ్యమంత్రి సహాయనిధికి జమ చేసినట్లు ఆయన వెల్లడించారు.

# జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఎంపిక


బల్లిపాడులో విద్యార్థులకు సైన్స్ బోధిస్తున్న మల్లికార్జున గంగా ప్రసాద్ (ఫైల్)


బాల ఈశ్వరయ్యను అభినందిస్తున్న మానవత సేవా సంస్థ సభ్యులు

**అత్తిలి:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యాశాఖ ప్రకటించిన జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న దొడ్డిపట్ల మల్లికార్జున గంగా ప్రసాద్ ఎంపికయ్యారు. 1997లో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన డీఎంజీ ప్రసాద్ 1999లో బల్లిపాడు-2 పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంను తల్లిదండ్రుల సహకారంతో అమలు చేశారు. పేద విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు పంపిణీ చేసి ఉదారతను చాటుకున్నారు. ఉన్నత విద్యను అభ్యసించే వారికి కళాశాల ఫీజులకు సహకారం అందించారు. సైన్స్‌ఫెయిర్‌లో స్కూల్, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పాల్గొని అవార్డులు సాధించడంలో విద్యార్థులను తీర్చిదిద్దారు. ఇన్ఫోసిస్ సహకారంతో జిల్లాలో 300 పాఠశాలలకు 90 కంప్యూటర్ల మంజూరుకు కృషి చేసి కంప్యూటర్ విద్యాభివృద్ధికి ప్రసాద్ విశేష సేవలందించారు. డి కుముదవల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ఫర్నీచర్‌ను రాజమండ్రి ఓఎన్‌జీసీ సహకారంతో 40 డెస్క్‌కమ్ బెంచీలు, 10 టీచర్స్ టేబుల్స్ మంజూరు చేయించారు. విద్యాబోధనలో సరళమైన పద్ధతిని అనుసరిస్తూ విద్యార్థులను సంబంధిత సబ్జెక్టులో నిష్ణాతులను చేయడంలో సఫలీకృతులయ్యారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన డీఎంసీ ప్రసాద్‌ను జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

**ప్రత్యేక ఉపాధ్యాయుడు బాల ఈశ్వరయ్యకు సత్కారం**

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** ఉపాధ్యాయుల దినోత్సవం పురస్కరించుకుని జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికైన భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్యను బుధవారం మానవతా సేవా సంస్థ ఆధ్వర్యంలో అభినందించి సత్కరించారు. సేవా సంస్థ సభ్యుడు పచ్చా వెంకటేశ్వరరావు, యర్ర ఆంజనేయస్వామి, చేకూరి బంగార్రాజు, టి.పాండురంగారావు, జే.రాజేంద్ర కుమార్, బి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

**జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక**

**అత్తిలి:** ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిల్ నాయకులు, బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల స్కూల్ అసిస్టెంట్ డీఎంజీ ప్రసాద్‌ను జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక చేయడంపై బుధవారం అత్తిలి మండల ఎస్టీయూ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి దావీదు, ఎంపీ సుబ్బరాజు, రాష్ట్ర కార్యదర్శి యూఎస్‌వీ శివయ్య, మండల అధ్యక్షుడు ఏ సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సీహెచ్‌జేఎస్ఎస్ ప్రసాద్ తదితరులు అవార్డు అందుకోబోతున్న ప్రసాద్‌ను అభినందనలు తెలిపారు. అత్తిలి మండలం ప్రాథమిక పాఠశాలల నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డుకు ఎంపికైన ఎం రామచంద్రరావు, జి సుధాకర్, ఎం రాజేష్, కె సోమసుందరానికి వారు శుభాకాంక్షలు చెప్పారు.

**ఇద్దరు ఉపాధ్యాయులకు జిల్లా ఉత్తమ అవార్డులు**

**పెంటపాడు:** పెంటపాడు మండలంలో ఇద్దరు ఉపాధ్యాయులు జిల్లాస్థాయిలో ఉత్తమ అవార్డులకు ఎంపికైనట్లు మండల విద్యాశాఖాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్ తెలిపారు. మీనవిల్లూరు జెడ్పీ స్కూలుకు చెందిన గణితం టీచర్ ఎస్.సూర్యనారాయణ, అలంపురం ఎంపీయూపీ-3 కి చెందిన ఎస్జీటీ పి. కనకమహాలక్ష్మి గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అవార్డులకు ఎంపికయ్యారన్నారు. వారు భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 5న డీఈవో నాగమణి ఆధ్వర్యంలో అవార్డులు అందుకుంటారన్నారు. అవార్డులకు ఎంపికైన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా ఎంఈవోలు అభినందించారు.

# ఎస్సీ వర్గీకరణ రాజ్యాంగ విరుద్ధం


అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మాల మహానాడు నాయకులు

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగానికి రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు తూట్లు పొడిస్తే చూస్తూ ఊరుకోమని, ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు హెచ్చరించారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పట్టణంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్గీకరణ విషయంలో రాజకీయ కుట్రలు దాగి ఉన్నాయని చెప్పారు. మాలలపై మందకృష్ణ విషం చిమ్ముతున్నాడని విమర్శించారు. ఆర్టికల్ 341 సవరించకుండా ఎస్సీ రిజర్వేషన్లు వర్గీకరణ చేయడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ వర్గీకరణ జరగకుండా అడ్డుకోవడానికి పోరాటాలకు సిద్ధమన్నారు. జైపాల్, రాజారావు, విజయ్‌కుమార్, సామ్రాజ్యం, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# విద్యుత్ సబ్ స్టేషన్‌లో సమస్యలపై వినతి


వేల్పూరు విద్యుత్ సబ్ స్టేషన్‌లో సమస్యలపై వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

**తణుకు టౌన్:** విద్యుత్ సబ్ స్టేషన్లలో ఖాళీగా ఉన్న పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సీపీఎం వేల్పూరు శాఖ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం తణుకు రూరల్ మండలం వేల్పూరులోని విద్యుత్ సబ్ స్టేషన్‌లో ఖాళీలను భర్తీ చేయాలని కోరుతూ సీపీఎం వేల్పూరు గ్రామ కమిటీ ఆధ్వర్యంలో తణుకులోని విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామ సీపీఎం కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు మాట్లాడుతూ వేల్పూరు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో వేల్పూరు, మహాలక్ష్మీ చెరువు, కొమరవరంతో పాటు తణుకు పట్టణంలోని వీరభద్రపురం ప్రాంతాలున్నాయని వీటి పరిధిలో సుమారు 15వేల విద్యుత్ కనెక్షన్లున్నాయన్నారు. ఈ సబ్ స్టేషన్‌లో తగిన సిబ్బంది లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం స్పందించి వెంటనే వేల్పూరు సబ్ స్టేషన్‌లో సమస్యలు పరిష్కరించి పూర్తి స్థాయి సిబ్బందిని నియమించాలని కోరారు. ఈసందర్భంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డీఈఈ కార్యాలయ షిఫ్ట్ ఆపరేటర్‌కు అందజేశారు. ఈకార్యక్రమంలో సీపీఎం కార్యదర్శులు వాసా వెంకటేశ్వరరావు, తిరునాథం వెంకటేశ్వరరావు, అంబటి రామకృష్ణ పాల్గొన్నారు.

### నేడు అలంపురానికి ప్రత్యేక వైద్యుల రాక

**పెంటపాడు:** అలంపురం వెంకటరమణ సేవా ట్రస్టు ఆసుపత్రికి గురువారం ప్రత్యేక వైద్యులు రానున్నట్లు ట్రస్టు ప్రతినిధి కొలనువాడ పెదకృష్ణంరాజు తెలిపారు. రాజమండ్రి జీఎస్ఎల్ ఆసుపత్రికి చెందిన ఎముకలు, కీళ్లు, జనరల్ సర్జన్, డెర్మటాలజీ, పల్మనాలజీ, ఈఎన్‌టీ, వైద్యులు వచ్చి వైద్య పరీక్షలు చేస్తారన్నారు. ఈ సందర్భంగా ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ వైద్యశిబిరానికి దూరప్రాంతాల నుంచి వచ్చే రోగులకు ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశామన్నారు. గుండెకు సంబంధించి ఈసీజీ, 2డీ ఈకో పరీక్షలు కూడా అవసరమైన వారికి ఉచితంగా చేస్తారన్నారు. ఈ అవకాశాన్ని పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఘాటెక్కిన ఉల్లి ధర

- వర్షాల వల్ల పెరుగుతున్న ధరలు
- మార్కెట్‌లో ప్రస్తుతం రూ.60
- ధరలు మరింత పెరిగే అవకాశం
- కాయగూరలదీ అదే దారి


గూడెం మార్కెట్‌లో అమ్మో అనిపిస్తూ అమ్మకానికి సిద్ధంగా ఉల్లిపాయలు

**పెంటపాడు:** గతంలో ఉల్లిపాయలు కోస్తుంటేనే కంట కన్నీరు వచ్చేది. ఇప్పుడు వాటిని కొంటేనే కన్నీరు మిగులుతోంది. ఇప్పటికే పెరిగిన ఉల్లి ధరలతో ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వాటి ధర మరింత పెరగనుంది. ప్రస్తుతం ఉల్లిపాయలు మార్కెట్‌లో రూ. 60 పలుకుతోంది. మరో నాలుగైదు రోజుల్లో ఈ ధర మరింత పెరిగే అవకాశం ఉందని ఉల్లి వ్యాపారులు చెబుతున్నారు. కిలో రూ. 10 నుంచి 20 వరకు పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు. గత ఆదివారం ఉల్లి ధర కిలో రూ.45-50 ఉంటే మంగళవారం రూ.60 పెరిగింది. ప్రస్తుతం జిల్లాకు మహారాష్ట్ర నుంచి ఉల్లిపాయలు దిగుమతి అవుతున్నాయి. వర్షాల వల్ల మన రాష్ట్రంలోని కర్నూల్ జిల్లాలో పండే ఉల్లి పంట దిగుబడి తగ్గింది. మళ్లీ దిగుబడులు అందుకోగానే కొండెక్కిన ధరలు తగ్గే అవకాశం ఉంది. మహారాష్ట్ర నుంచి వచ్చే దిగుమతులు పెరిగితేనే ధర తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న రేటు మరింత పెరిగే అవకాశం ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

**కూరగాయలదీ అదేదారి**

ఉల్లిపాయలతో పాటు, పచ్చిమిర్చి, టమాటాలు తదితర కాయగూరల ధర కూడా భారీగా పలుకుతోంది. బీరకాయలు, బీన్స్, క్యారెట్, బీట్‌రూట్ తదితర కూరగాయలు కిలో రూ. 60 పైమాటే. ఈ నేపథ్యంలో ఉల్లితో పాటు, కాయగూరలు కొనేందుకు ప్రజలు ఆలోచిస్తున్నారు.పెరుగుతున్న ధరలను అదుపు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

### కూలిన పెంకుటిల్లు గోడ


కూలిన గోడను పరిశీలిస్తున్న దృశ్యం

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** పట్టణంలో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు స్థానిక 14వ వార్డులో సత్యనారాయణ పేటలో వర్షానికి నాని ఓ పెంకుటిల్లు గోడలు కూలిపోయాయి. ఆ సమయంలో ఆ ఇంట్లో ఎవ్వరు లేకపోవడం ప్రమాదం తప్పింది. నాలుగు కుటుంబాలు వారు ఇంట్లో అద్దెకు ఉంటున్నారు. యువత సహాయంతో ఇంట్లోని వస్తువులను సురక్షిత ప్రాంతంలోకి తరలించారు. అద్దెకు ఉంటున్నవారు మరొచోటికి తరలివెళ్లారు. కూలిన ఇంటిని అధికారులు, రాజకీయ నాయకులు పరిశీలించారు.





### నేడు డిగ్రీ కళాశాలలో గురు పూజోత్సవం

**పెంటపాడు:** స్థానిక డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం గురుపూజోత్సవం నిర్వహించనున్నట్లు ఎంఈవో టీవీ రామకృష్ణ తెలిపారు. కళాశాల ఆడిటోరియంలో మధ్యాహ్నం 2 గంటలకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నాయకులు తాడేపల్లి మోహనరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విశిష్ట సేవలందించిన ఉపాధ్యాయులకు అవార్డులు ప్రదానం చేసి ఘనంగా సత్కరిస్తామని తెలిపారు. ఈకార్యక్రమాన్ని ఉపాధ్యాయులు, విద్యార్థులు విజయవంతం చేయాలని ఎంఈవో కోరారు.

### నేడు సంగీత, సాంస్కృతిక సమాహారం

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** బీవీఆర్ కళాకేంద్రం కళాకారులతో స్థానిక డీఎస్ చెరువు సమీపంలోని బుద్దాల కన్వెన్షన్ హాల్లో ఈనెల 5వ తేదీ గురువారం సాయంత్రం నెలవారీ సంగీత, నృత్య, సాహితీ, సాంస్కృతిక సమాహారం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు బుద్దాల వెంకట రామారావు తెలిపారు. కళాకారులతో ట్రాక్ సింగింగ్, బుర్రకథ, సభా, కళాకారులకు సత్కారాలు నిర్వహించనున్నట్టు వెంకట రామారావు చెప్పారు. కళాకారులు, సాహితీ ప్రముఖులు, పట్టణ ప్రజలు పాల్గొనాని ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

# విజయవాడలో సేవా కార్యక్రమాలు


విజయవాడలో పారిశుధ్య నిర్వహణలో కమిషనర్, పారిశుధ్య సిబ్బంది


విజయవాడలో ముంపు బాధితులకు ఆహారం అందజేస్తున్న స్వచ్ఛంద సేవ సంస్థ సభ్యులు

**తణుకు:** విజయవాడలో వరద ముంపు ప్రాంతాల్లో బాధితులకు తణుకు ఉందుర్తి పాల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ ఉందుర్తి ప్రసన్నకుమార్‌తోపాటు సభ్యులు విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన బాధితులకు ఆహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు ఉందుర్తి ఎలీషా, తలపాకుల అఖిల్, దున్న అమర్‌బాబు, నేకూరి తరుణ్ పాల్గొన్నారు.

**వరద బాధితులకు డైమండ్స్ సహాయం**

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** విజయవాడ వరద బాధితులకు లయన్స్ క్లబ్ ఆఫ్ డైమండ్స్ సహాయం అందించారు. జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు పిలుపు మేరకు డైమండ్స్ క్లబ్ తరుపున బుధవారం మూడు కారులలో పట్టణం నుంచి వెళ్లి 20 బాక్సుల ఆహారం, 10 కేసులు వాటర్ బాటిళ్లు, వస్త్రాలు అందజేశారు. జిల్లా కోఆర్డినేటర్ పేరిచర్ల మురళీకృష్ణంరాజు జండా ఊపి ప్రారంభించారు. డాక్టర్ దుర్గా ప్రసాద్, రమాదేవి, మదన్ మోహన్ అగర్వాల్, రత్నకుమారి, ఆకుల సతీష్, ఆదిలక్ష్మి, డాక్టర్ సత్యనారాయణ, వెంకటరత్నం, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

**సహాయక చర్యల్లో ..**

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** విజయవాడ వరదల సహాయక చర్యల్లో తాడేపల్లిగూడెం అగ్నిమాపక అధికారి గణేశ్న వెంకట రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది పాల్గొన్నారు. ముంపునకు గురైన ప్రాంతాల నుంచి ప్రజలను బోట్ల ద్వారా పునరావాస కేంద్రాలకు తరలించారు.

**పారిశుధ్య నిర్వహణలో కమిషనర్**

**తాడేపల్లిగూడెం (టీటీసీ):** వరదలు కారణంగా విజయవాడ కార్పొరేషన్‌లో వ్యర్థాలు, చెత్తా చెదరాలు ఎక్కడవి అక్కడే నిలిచిపోయాయి. దీంతో అక్కడకు తాడేపల్లిగూడెం పురపాలక సంఘం కమిషనర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు, పారిశుధ్య సిబ్బంది చేరుకుని విజయవాడలో పారిశుధ్య విధులు నిర్వహించారు.